ప్రజాశక్తి
శనివారం 11 జనవరి 2025 5 విజయనగరం

పాటల రచయిత పైడిశెట్టి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలోని బూసాయవలస గ్రామానికి చెందిన యువ పాటల రచయిత రామ్ పైడిశెట్టి (42) హైదరాబాద్‌లో అనుమానాస్పదంగా మృతి చెందారు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. చంటి, సితార, కలెక్టర్ గారి భార్య, నందీశ్వరుడు తదితర సుమారు 20 సినిమాలకు పాటల రచయితగా పైడిశెట్టి పనిచేశారు. ఒకచిన్న కుగ్రామానికి చెందిన ఈయన చిన్నతనంలోనే హైదరాబాద్ వెళ్లిపోయి అక్కడ పాటల రచయితగా ఎంతో పేరు ప్రతిష్టలు సంపాదించారు. ప్రముఖ గాయనీమణులు చిత్ర, శైలజ తదితరులతో ఈయన పనిచేశారు. ఎంతో భవిష్యత్తు ఉన్న ఈ గాయకుడు ఆకస్మికంగా మృతిచెందడం పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆయన మృతికి ఇదే గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపిపి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతినాయుడు సంతాపం తెలిపారు.

48,411 ఎకరాలకు బీమా

వరి పంట నమోదుకు 15వ తేదీ తుదిగడువు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో రబీ పంటలకు సంబంధించి 48,411 ఎకరాల మేర ఇన్యూరెన్స్ బుకింగ్ సాగింది. వరి పంటకు ఈనెల 15వ తేదీ వరకు ఇన్సూరెన్స్ చేసుకునే అవకాశం కల్పించారు. మిగిలిన పంటలకు ఇప్పటికే సమయం ముగిసిన సంగతి విధితమే. రైతులంతా రైతు సేవా కేంద్రాల్లోని అగ్రికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో రబీ పంటలు రెండవ ప్రాధాన్యతలో ఉంటాయి. కేవలం నీటి లభ్యత ఉన్నచోట మాత్రమే వరి తదితర పంటలు సాగవుతాయి. మిగిలిన చోట్ల ఇతర పంటలు సాగవుతున్నాయి. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా రబీ పంటల సాధారణ సాగు విస్తీర్ణం 1,62,617 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 70,566 ఎకరాల్లో సాగయ్యాయి. అత్యధికంగా మినుములు 28,659 ఎకరాలు, పెసలు 12,405, మొక్కజొన్న 23, 700 ఎకరాల్లో సాగయ్యాయి. రాగులు 1137 ఎకరాలు, ఉలవలు 825, మిర్చి 62ఎకరాలు, వేరుశనగ 356, కూరగాయలు 766 ఎకరాలు, వివిధ రకాల పండ్లు 292, టమాట 121, వరి 106 ఎకరాల చొప్పున పడ్డాయి. సీజన్ ఫిబ్రవరి వరకు ఉన్నందున మొక్కజొన్న విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వీటిలో నాలుగు పంటలు (పెసలు, మినుములు, మొక్కజొన్న, వరి) పంటలకు మాత్రమే ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించారు. ఈ ఏడాది అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా బీమా సదుపాయం ప్రభుత్వం కల్పించింది. ఈ కంపెనీ నిబంధనల ప్రకారం మొక్కజొన్నకు రూ.540, మినుములు, పెసలు రూ.300, వరి రూ.630 ప్రీమియం చెల్లించాల్సివుంది. 510 రైతు సేవా కేంద్రాల ద్వారా మొత్తం 27,115 మంది రైతుల నుంచి 1,23,329 బీమా దరఖాస్తులు స్వీకరించారు. రుణసాయం పొందినవారి వద్ద నుంచి సంబంధిత బ్యాంకులే పంటల బీమా ప్రీమియం మినహాయిస్తున్న సంగతి విధితమే. రుణాలు తీసుకోని రైతులు కూడా కొన్ని మండలాల్లో శతశాతం రైతులు బీమా సదుపాయానికి ఆసక్తి చూపినట్టుగా అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 100శాతం బీమా సదుపాయం పొందిన మండలాల్లో గంట్యాడ, జామి, ఎస్.కోట, ఎల్.కోట, దత్తిరాజేరు, బొబ్బిలి, బాడంగి, బొండపల్లి, రాజాం మండలాలు ఉన్నాయి. తెర్లాంలో 90శాతం మంది రైతులు ఇన్సూరెన్స్ పొందారు. మొత్తంగా 48,411 ఎకరాల మేర బీమా సదుపాయం నమోదైంది. వరినాట్లు అక్కడక్కడా ఇంకా పడుతున్నందున ఈనెల 15వ తేదీ వరకు బీమా ప్రీమియం చెల్లించుకునేందుకు సంబంధిత ఇన్సూరెన్స్ కంపెనీ అవకాశం కల్పించింది. రైతులు స్థానిక రైతు సేవాకేంద్రాలను సంప్రదించి ప్రీమియం చెల్లించుకోవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఓవైపు పంటల సాగుకు పెరిగిన పెట్టుబడులు, మరోవైపు తరచు అతివృష్టి, అణావృష్టి, చీడపీడలు ఇబ్బంది పెడుతున్న నేపథ్యంలో రైతులకు పంటల బీమా అత్యంత ప్రాధాన్యతగానే భావించాల్సివుంది.

ఆర్‌టిసి కాంప్లెక్సులో ప్రయాణికుల రద్దీ

పల్లెకు పోదాం.. చలో చలో

- సంక్రాంతికి సొంతూరు బాట పట్టిన విద్యార్థులు, వలస కూలీలు
- విద్యాసంస్థలకు సెలవులతో పెరిగిన రద్దీ

ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న ఓ కుటుంబం

ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న వలస కార్మికురాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

సంక్రాంతి పండగకు పట్నం నుంచి పల్లెకు జనం క్యూ కడుతున్నారు. శుక్రవారం నుంచి పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఇవ్వడంతో విద్యార్థులంతా లగేజీలతో ఇళ్లకు బయలుదేరారు. మరోవైపు ఉద్యోగులకు సైతం శనివారం నుంచి వరుస సెలవులు కావడంతో స్వగ్రామాలకు క్యూ కడుతున్నారు. ఇంకోవైపు ఉపాధి కోసం హైదరాబాద్, రాజమండ్రి, విజయవాడ, చెన్నై, కోల్‌కోతా వంటి పట్టణాలకు వలస వెళ్లిన వారంతా మూటాముల్లతో సొంతూళ్లకు వస్తుండడంతో జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్, ఆర్‌టిసి కాంప్లెక్సు కిట కిటలాడుతున్నాయి. తమ గ్రామాలకు వెళ్లేందుకు వీరంతా ఆర్టీసీ కాంప్లెక్స్‌కు, రైల్వేస్టేషన్ కు చేరుకోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా చోట్ల రద్దీ నెలకొంది. బస్సులు ఖాళీ లేక అవస్థలు పడుతున్నారు. మరోవైపు సకాలంలో బస్సులు రాకపోవడంతో గంటల తరబడివేచి చూశారు.

మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు చేసిన మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

సర్వేలో విస్తీర్ణం తగ్గిందని

మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు

సంబంధిత భూమిని పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-భోగాపురం

సర్వేలో 10 సెంట్ల విస్తీర్ణం తగ్గిందని విశాఖకు చెందిన ఓ మహిళ విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో ఆ భూమిని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ శుక్రవారం పరిశీలించారు. విశాఖకు చెందిన అల్లాడ జయశ్రీ తల్లి మండలంలో లక్ష్మీపురం రెవెన్యూలో చాలా ఏళ్ల కిందట 45 సెంట్లు భూమిని కొనుగోలు చేశారు. కానీ రీసర్వేలో సర్వే నంబరు 68/1లో 25 సెంట్లు, 68/2లో 10 సెంట్లు మాత్రమే నమోదైంది మిగతా 10 సెంట్లు తగ్గింది. ఈ మేరకు తహశీల్దార్ ఎం.సురేష్, సర్వేయర్ మధుకేశ్వరరావు ఆధ్వర్యంలో సర్వే చేశారు. గతంలో కొనుగోలు చేసిన భూమి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ప్రకారం భూమి వేరే చోట ఉండగా, ఆమె మరో సర్వే నెంబర్లో ఉన్న భూమిలో అనుభవంలో ఉన్నట్లు తేల్చారు. స్థానిక రెవెన్యూ అధికారులు కూడా ఇదే విషయాన్ని కలెక్టర్‌కు వివరించారు. రికార్డు ప్రాప్తికి అక్కడ భూమి లేకపోవడంతో పాటు తప్పు నెంబర్‌తో గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు గుర్తించి ఆమెకు కూడా వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కీర్తి, తహశీల్దార్ ఎం.సురేష్, ఆర్ఐ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె ఒప్పంద జిఒలు ఇవ్వాలి

- 62 ఏళ్ల వరకు విధుల్లో కొనసాగించాలి
- మున్సిపల్ కార్మికుల ధర్నాలు

విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు, మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గతంలో మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పంద జీవోలను ఇవ్వాలని, కార్మికులను 62ఏళ్ల వరకు ఉద్యోగంలో కొనసాగించాలని సంక్రాంతి కానుక, హెల్త్ అలవెన్స్, సరెండర్ లీవ్ డబ్బులు, డిఎ , జీతాలు బకాయి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు ఎ.జగన్మోహన్ మాట్లాడుతూ రిటైర్మెంట్ బెనిఫిట్స్, మట్టి ఖర్చులు, ఎక్స్‌గ్రేషియా పెంపు తదితర రాతపూర్వక హామీలకు తక్షణమే జీవోలు ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ అయిన 12 మందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, మరణించిన వారి బిడ్డలకు ఉద్యోగాలివ్వాలని, జీవో నెంబర్ 12 ప్రకారం ఇంజినీరింగ్ మరియు నాన్ పిహెచ్ కార్మికులందరికీ సంక్రాంతి కానుక 1000 రూపాయలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. జనవరి 6న రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జీవో నెంబర్ 2ను సవరించి కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, థర్డ్ పార్టీ ఎన్ఎంఆర్ కార్మికులందరినీ (ఎంటిఎస్) మినిమం టైమ్ స్కేల్ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ధర్నాలో యూనియన్ నాయకులు బి.భాస్కరరావు, బి.రాఘవ, బి.చిన్ని, తిరుమలరావు, కృష్ణ, పైడిరాజు కార్మికులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల.. నిరసన తెలుపుతున్న ఫెడరేషన్ నాయకులు, మున్సిపల్ కార్మికులు

నెల్లిమర్ల : సమ్మె ఒప్పంద జిఒలు ఇవ్వాలని స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు బాబూరావు, హరిబాబు, దుర్గారావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. ధర్నాలో పలువురు ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ప్రసవ వేదన

- డోలీలో గిరిజన గర్భిణీ
- మార్గం మధ్యలో డెలివరీ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రపంచమంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) గురించి మాట్లాడుకుంటోంది. చంద్రుడిపైనా మన దేశం ఎప్పుడో కాలుమోపింది. ప్రస్తుత కంప్యూటర్ యుగంలో అసాధ్యాలెన్నో సుసాధ్యమవుతున్నాయి. అయినా, పాలకుల పుణ్యమా! అని గిరిజనానికి డోలీ మోతలకు మోక్షం లభించడం లేదు. 'అమ్మ'తనానికి ఎంతో వేదన తప్పడం లేదు. అలాంటి సంఘటనే శృంగవరపుకోట మండలంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది.

శృంగవరపుకోట పంచాయతీ రేగపుణ్యగిరి గ్రామానికి చెందిన సీదరి శాంతికి గురువారం రాత్రి 11 సమయంలో పురిటి నొప్పులు వచ్చాయి. ఎస్.కోట పట్టణ కేంద్రానికి తొమ్మిది కిలోమీటర్ల దూరం కొండలపై ఉన్న ఆ గ్రామానికి రహదారి సౌకర్యం లేదు. శాంతి భర్త శివ తోటి గిరిజనుల సాయంతో డోలి కట్టి, రాత్రి ఒంటిగంట సమయానికి పుణ్యగిరి దేవస్థానం టికెట్ కౌంటర్ వద్దకు ఆమెను తీసుకొచ్చారు. శాంతికి పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో మరో గిరిజన మహిళ డెలివరీ చేయించింది. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. 108 వాహనానికి ఫోన్ చేసినా స్పందించలేదని, ఎఎన్ఎంలు కూడా లేటుగా స్పందించారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. 2.30 గంటల సమయంలో 108 వాహనం రావడంతో అందులో శృంగవరపుకోట ఏరియా ఆస్పత్రికి తల్లి, బిడ్డను తరలించారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

రహదారి నిర్మాణానికి కలెక్టర్ స్థల పరిశీలన

కేన్సర్ స్క్రీనింగ్ అంబులెన్స్ ప్రారంభం

స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

చీడిపాలెం గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు రహదారి నిర్మాణానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్థల పరిశీలన చేశారు. ఆయన శుక్రవారం ఎస్.కోట మండలంలో పర్యటించారు. జాతీయ రహదారి 516-ఇ నుంచి చీడిపాలెం గ్రామానికి రహదారి వేయాలని ఇటీవల కలెక్టర్‌కు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. దీంతో ఆయన ఈ గ్రామానికి ప్రస్తుతం ఉన్న గ్రావెల్ రహదారిని పరిశీలించారు. తాహశీల్దార్ అరుణకుమారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మ్యాప్‌లను పరిశీలించారు. సర్వే చేసి రహదారి నిర్మాణానికి స్థల సేకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం అక్కడికి సమీపంలోని సాయిపల్లిని కలెక్టర్ సందర్శించారు. శ్రీ సత్యసాయి దివ్యామృతం ఆశ్రమంలో నిర్మాణంలో ఉన్న వంద పడకల కేన్సర్ ఆసుపత్రిని, ఓపి గదులను, భోజన శాలను పరిశీలించారు. ఆసుపత్రికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. శారదా మెటల్స్ అండ్ అల్లాయిస్ లిమిటెడ్ కంపెనీ సమకూర్చిన కేన్సర్ స్క్రీనింగ్ అంబులెన్స్‌ను కలెక్టర్ ప్రారంభించారు. సాయిపల్లికి రహదారి సౌకర్యం కల్పించాలని ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నన్నయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు, తాహశీల్దార్ అరుణకుమారి, డిప్యూటీ తాహశీల్దార్ భరత్, సాయిపల్లి ఆశ్రమ స్వామీజి, ఇతర ప్రతినిధులు, శారదామెటల్స్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ దరఖాస్తును ఆడిట్ చేయాలి

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ఆడిట్ చేసి సానుకూలంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ తన్ ఛాంబర్ లో నియోజకవర్గం ఇంఛార్జిలైన డిప్యూటీ కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తాహశీల్దార్లు పరిష్కరించిన ప్రతి దరఖాస్తును ఆడిట్ చేయాలని చెప్పారు. సదస్సుల్లో మొత్తం 6846 దరఖాస్తులు రాగా, ఇప్పటికే 2776 దరఖాస్తులను తహశీల్దార్లు పరిష్కరించారని, వాటిని కూడా ఆడిట్ చేయాలని తెలిపారు. గ్రామాల్లో అర్జీ దారులను పిలిపించి వారు సంతృప్తి చెందే విధంగా పరిష్కారం చూపించాలన్నారు. ఈ దరఖాస్తులను పరిష్కరిస్తే జిల్లాలో రెవెన్యూ పరమైన సమస్యలన్నీ దాదాపు పరిష్కరించినట్టేనని తెలిపారు. కోర్టులనుంచి ప్రత్యేకంగా ఏమైనా ఆదేశాలు ఉన్నవి మినహా, వివాదాలు ఉన్న భూములను కూడా పరిష్కరించవచ్చునని సూచించారు. రీ సర్వేలో వచ్చిన దరఖాస్తులను కూడా రెవిన్యూ సదస్సుల్లో కవర్ అయినది లేనిది పరిశీలించాలన్నారు. సమాధానాలు అస్పష్టంగా ఉండకూడదని అన్నారు. రోజుకు ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని డిప్యూటీ కలెక్టర్లు మొత్తం దరఖాస్తులను ఆడిట్ చేయాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒలు కెఆర్ఆర్‌సి ఎస్‌డిసి మురళీ, ఇన్‌ఛార్జి డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

పాడి రైతుల అభ్యున్నతికి కృషి

గోకులాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేలు కళా, కోళ్ల

లక్కవరపుకోట.. గోకులాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

ప్రజాశక్తి-శృంగవరపుకోట, లక్కవరపుకోట

పాడి రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శృంగవరపుకోట, లక్కవరపుకోట మండలాల్లోని గోపాలపల్లి, ఎల్.కోట తలారి గ్రామాల్లో ఉపాధి హామీ ద్వారా నిర్మించిన మినీ గోకుల షెడ్లను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోకులాలను అవసరమైన వారికి మంజూరు చేసినట్లు తెలిపారు. లక్కవరపుకోట మండలంలో 38 గోకులాలు మంజూరైతే, 13 షెడ్ల నిర్మాణాలు పూర్తయినట్లు చెప్పారు. కార్యక్రమంలో డ్వామా పీడీ శారదా దేవి, టిడిపి శృంగవరపుకోట, లక్కవరపుకోట మండలాల అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, చొక్కాకుల మల్లునాయుడు, మాజీ జెడ్‌పిటిసి ఈశ్వరరావు, సర్పంచులు మహేష్, కోళ్ల భూపాల్‌నాయుడు, ఎపిఎం ఎం.విజయలక్ష్మి, మాజీ సర్పంచులు లగుడు ఎర్నాయుడు, గుమ్మడి ప్రసాద్, మాజీ ఎంపిటిసి రాముడు, నాయకులు డోకుల అచ్చెన్నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గోకులాల డిజైన్ మార్చాలని వినతి

ఉపాధి హామీ నిధులతో నూతనంగా నిర్మించబోయే గోకులాల షెడ్ల డిజైన్ మార్చాలని జనసేన నాయకులు వబ్బిన సన్యాసినాయుడు, పి.రవి.. డ్వామా పీడీ శారదా దేవికి వినతి పత్రాన్ని అందజేశారు. గోపాలపల్లిలో గోకులాల ప్రారంభోత్సవానికి హాజరైన పీడీని కలిసిని వినతి అందించారు. ప్రస్తుతం ఉన్న పశువుల షెడ్ల నిర్మాణం సౌకర్యవంతంగా లేదని తెలిపారు.

విజయనగరంకోట.. గోకులం ప్రారంభోత్సవంలో పాల్గొన్న తూర్పుకాపు సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ యశస్విని, నాయకులు

గుర్ల : అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కళా వెంకట్రావు అన్నారు. శుక్రవారం అచ్యుతాపురంలో మినీ గోకులాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం టిడిపి మండల అధ్యక్షులు చనమల్ల మహేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రూ.6 కోట్లతో తోటపల్లి కాలువ మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. దీనివల్ల చీపురుపల్లి నియోజకవర్గంలో 52 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు వెన్నె సన్యాసినాయుడు, తిరుమల రాజు కిరణ్ కుమార్, గొర్లి రామునాయుడు, మండల అప్పలనాయుడు, కనిమెరక కృష్ణ, తహశీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపిడిఒ శేషబాబు, ఎపిఒ కామేశ్వరరావు పాల్గొన్నారు.

విజయనగరం కోట : విజయనగరం మండలం రాకోడులో రూ.2.30లక్షల వ్యయంతో నిర్మించిన నాలుగు గోశాలలను స్థానిక ఎంపిటిసి సభ్యులు వేచలపు శ్రీనివాసరావుతో కలిసి రాష్ట్ర తూర్పు కాపు సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్విని శుక్రవారం ప్రారంబించారు.అనంతరం కోరుకొండపాలెంలో 5, గుండాపేటలో 4 గోకులాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ డి. తిరుపతి నాయుడు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, ఎంపిటిసి పి. రాజేష్ బాబు, మాజీ ఎంపిపి కంది సాయి జగ్గారావు, మాజీ సర్పంచ్ జి. రామసత్యం, మాజీ ఉపసర్పంచ్ వి.రామసత్యం. పార్టీ నాయకులు జి. ప్రసాదరావు, చొప్ప రామారావు, గోశాల యాజమాని పొరిపి రెడ్డి రమణ పాల్గొన్నారు. అనంతరం కోరుకొండ, గుండాలపేట, కోరుకొండపాలెంలో పలు గోశాలలను ప్రారంభించారు.

ఉద్యోగుల ఆర్థిక బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎపిటిఎఫ్ (1938) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.బలరాంనాయుడు, ఎన్‌వి పైడిరాజు డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా కమిటి సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎ. సదాశివరావు, ఉపాధ్యక్షులు డి. ఈశ్వరరావు హాజరయ్యారు. ఉత్తరాంధ్ర శాసనమండలి ఎన్నికలలో గాదె శ్రీనివాసులు నాయుడును గెలిపించుకోవాలని తీర్మానం చేశారు. 12వ పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించాలని, జెఎల్, డైట్ లెక్చరర్ ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు.

నూతన ప్రతిపాదనలో ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లీష్, తెలుగు మీడియం మాధ్యమాలను కొనసాగించాలని, ఉన్నత పాఠశాలలో తరగతికి 54 మంది విద్యార్థులు కాకుండా 1:40 నిష్పత్తి విద్యార్థుల సంఖ్య ఉండాలని, ప్రాథమిక పాఠశాలలో 1:20 నిష్పత్తి ఉండాలని తీర్మానాలు చేశారు. సమావేశంలో ఆర్.కృష్ణ, ఎన్.శ్రీదేవి, ఎవి శ్రీనివాసరావు, సిహెచ్ పైడితల్లి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియ

ప్రజాశక్తి-విజయనగరంకోట

పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాలకు ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు దేహ దారుఢ్య పరీక్ష సజావుగా కొనసాగుతోందని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం 9వ రోజు పిఎంటి. పిఇటి పరీక్షలకు 600 మంది పురుష అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 408 మంది మాత్రమే హాజరయ్యారు. వేకువ జామున 5గంటల నుండే ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. ఎస్‌పి వకుల్‌జిందాల్, ఎఎస్‌పి పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు స్వయంగా పర్యవేక్షించారు. అభ్యర్థులకు ముందుగా హాల్ టికెట్స్ పరిశీలించి, పోలీసు పరేడ్ గ్రౌండులోకి అనుమతించారు. అనంతరం, అభ్యర్థుల విద్యార్హతలు, రిజర్వేషన్లు, వయస్సు నిర్ధారించే ధవపత్రాలను పరిశీలించి, అన్ని సర్టిఫికేట్స్ సక్రమంగా ఉన్న అభ్యర్థులకు మాత్రమే బయోమెట్రిక్ తీసుకొని పిఎంటి పరీక్షలకు అనుమతించారు.

జగదీష్‌ను అభినందిస్తున్న సీతం కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు

జాతీయ, అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో 'సీతం' విద్యార్థికి పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న కె.జగదీష్ స్కూల్ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నవంబర్ 16 నుంచి 18 వరకు నార్త్ గోవాలో జరిగిన జాతీయ 10వ ఓపెన్ స్కూల్ గేమ్స్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున పాల్గొని అండర్- 19 బాక్సింగ్ పోటీల్లో 60-63 కిలో గ్రాముల బరువు కేటగిరీలో బంగారు పతకం సాధించారు. డిసెంబర్ 20 నుంచి 24 వరకు నేపాల్ లో జరిగిన ఇండోనేపాల్ స్కూల్ గేమ్స్ ఛాంపియన్‌షిప్ ఓపెన్ బాక్సింగ్ అండర్-19 అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో 60-63 కిలోల బరువు కేటగిరీలో రజత పతకం సాధించాడు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణ రావు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ డాక్టర్ డివి రామమూర్తి, విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీలత, అధ్యాపకులు, విభాగాధిపతులు, ఫిజికల్ డైరెక్టర్లు, కోచ్‌లో పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీ పరిధిలో మెప్మా విభాగంలో సర్వీస్ ప్రొవైడర్లకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, నైపుణ్య పెంపుదల శిక్షణకు దరఖాస్తులను స్వీకరించినట్లు కమిషనర్ రామలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, బ్యూటీషియన్, సెలూన్, కార్పెంటర్, ఫ్రిజ్, కూలర్, ఎసి, టివి రిపేర్, తదితర కోర్సుల్లో ప్రవేశానికి సుమారు 200 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీరంతా రూ.వెయ్యి ప్రవేశ రుసుం చెల్లించి, నైపుణ్యాభివృద్ధి శిక్షణ విజయనగరం వెళ్లేందుకు సిద్ధం కావాలని కమిషనర్ తెలిపారు. 3 నెలల శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో టిపిఆర్‌ఒ ఎం.జగన్మోహనరావు, సిఎంఎం ఎం.లలిత, సిఒలు పోలినాయుడు, సింహాచలం, ఆర్‌పిలు జ్యోతి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాలు లేకుండా మంజూరైన పనులపై విచారణ

ప్రజాశక్తి-భోగాపురం

పంచాయతీ తీర్మానం లేకుండా చేపట్టిన పల్లె పండుగ పనుల వ్యవహారంలో దల్లిపేట సర్పంచ్ ఫిర్యాదు మేరకు శుక్రవారం విచారణ నిర్వహించారు. విస్తరణ అధికారి కె.గాయత్రి విచారణ చేశారు. పంచాయతీతోపాటు మండల పరిషత్, జిల్లా పరిషత్ తీర్మానాలు లేకుండా దల్లిపేట పంచాయతీలో నాలుగు పనులు మంజూరు కావడంతో సర్పంచ్ దల్లి కాంత ఐటీడీఏ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ రిజ్వాన్, గ్రామ సర్పంచ్ దల్లి కాంత, గతంలో పనిచేసిన కార్యదర్శి రమేష్‌ను పంచాయతీ కార్యాలయంలో వేర్వేరుగా ఆమె విచారించారు. విచారణ నివేదికను జిల్లా పంచాయతీ అధికారితో పాటు ఎంపిడిఒకు అందజేస్తానని ఆమె తెలిపారు.

పలు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య, ఇతర అధికారులతో కలిసి 7 వ డివిజన్ దాసన్నపేట ప్రాంతంలో పర్యటించారు. కాపు వీధి, యాతవీధి, ఏనుగుల తోట, దాసన్నపేట, గౌడ వీధి తదితర ప్రాంతాలలో పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రజల నుండి అడిగి తెలుసుకున్నారు. కొన్ని ప్రాంతాలలో పశువులను రహదారులపై విచ్చలవిడిగా విడిచిపెట్టడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని కొంతమంది అధికారుల దృష్టికి తెచ్చారు. అయితే పశువులను నిర్దేశిత ప్రాంతాల్లో నిలుపుదల చేయాలని, విచ్చలవిడిగా పశువులను విడిచిపెట్టరాదని కమిషనర్ తెలిపారు. వృథాగా నీటిని విడిచిపెట్టడాన్ని, ప్రతి కుళాయికి ఆన్ ఆఫ్ స్విచ్ లను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, స్థానిక కార్పొరేటర్ పొంతపల్లి మాలతి, ఎసిపి హరిబాబు, టిపిఆర్‌ఒ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

16నాటికి స్వచ్ఛందంగా ఫ్లెక్సీ లు తొలగించాలి

నగరంలో వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఈనెల 16వ తేదీ రాత్రి కల్లా స్వచ్ఛందంగా తొలగించాలని కమిషనర్ పల్లి నల్లనయ్య ఓ ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ కొంతమంది ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారని, అయితే వాటిని ఈనెల 16వ తేదీ వరకు మాత్రమే అనుమతిస్తున్నట్లు చెప్పారు. 17వ తేదీ ఉదయం కల్లా ఎక్కడైనా ఫ్లెక్సీలు కనిపిస్తే ప్రణాళిక సిబ్బంది వాటిని తొలగిస్తారని తెలిపారు.

ఇంటర్ బోర్డు ప్రతిపాదనలు సరికాదు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇంటర్మీడియట్ బోర్డు ప్రతిపదించిన నూతన విధానాలతో సెకండ్ లాంగ్వేజ్ పేపర్ తో వస్తున్న సమస్యలను సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ పి.జనార్ధననాయుడు దృష్టికి భాషా అధ్యాపకులు తీసుకొచ్చి శుక్రవారం కాలేజీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఇంటర్ బోర్డు నూతనంగా ప్రతిపాదించిన 5 పేపర్లలో సెకండ్ లాంగ్వేజ్‌గా తెలుగు, సంస్కృతం, హిందీ వంటి భాషలను పరీక్షలు నిర్వహిస్తుడటం వలన భాషాధ్యాపకులు ప్రైవేట్ కళాశాలలోనైనా ఉపాధి పొందుతున్నారని తెలిపారు. బోర్డు నిర్ణయం వల్ల సుమారు 10వేల కుటుంబాలు జీవనోపాధి కోల్పోయి వీధిన పడతాయన్నారు. విజయనగరం సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ పి.జనార్ధన నాయుడు దృష్టికి తీసుకోనివచ్చారు.

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

బాల్య వివాహాలతో అనర్థాలు

ప్రజాశక్తి-వేపాడ

బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలని ఐసిడిఎస్ సిడిపిఒ ఆర్.ఉమాదేవి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో కిశోర వికాసంపై ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. బాల్య వివాహాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం కిశోర వికాసంపై వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సూర్యనారాయణ, తహశీల్దార్ రాములమ్మ, ఎస్ఐ జయంతి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు జి.కామేశ్వరి, పి.భాగ్యవతి, కె.స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీసులతో సమీక్ష

ప్రజాశక్తి-తెర్లాం

తెర్లాం పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఎస్ఐ సాగర్‌బాబు ఆధ్వర్యంలో సచివాలయ మహిళా పోలీసులతో సమీక్ష నిర్వహించారు. సంక్రాంతి పండగ సందర్భంగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పేకాట, కోడిపందేలు, గంజాయి, డ్రగ్స్ తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

బ్రిడ్జి గోడలపై ఆకర్షణీయ చిత్రాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణ సుందరీకరణకు రైల్వే ఫ్లైఓవర్ గోడలకు వేస్తున్న చిత్రాలను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ సుందరీకరణకు గోడలపై చిత్రాలు వేస్తున్నట్లు చెప్పారు. పనుల్లో నాణ్యత పాటించేలా చూడాలని మున్సిపల్ డిఇ కిరణ్‌కుమార్‌ను కోరారు. కార్యక్రమంలో ఎఇ రవికుమార్ పాల్గొన్నారు.

గొట్లాం గాయత్రి స్కూల్లో వివిధ వేషధారణల్లో చిన్నారులు

గురజాడ పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో చిన్నారులు

బొబ్బిలిలో అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల సంక్రాంతి సంబరాలు

సంక్రాంతి సందడి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిల్లాలోని విద్యాసంస్థలు, అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. మండలంలోని భవాని నగర్‌లో శ్రీగౌరీ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి మంటలు, రైతు వేషధారణ, కొమ్ము దాసరి, వివిధ రంగోలీలు, పిల్లల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కాండ్రేగుల వెంకటరాము పాల్గొన్నారు. సర్వేపల్లి పాఠశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు రంగవల్లికలు, గాలిపటాల తయారీ, సంప్రదాయ వస్త్రధారణ వంటి పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు కరస్పాండెంట్ సిహెచ్ సన్యాసిరావు, డైరెక్టర్ వై.వెంకటరావు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ పైడిరాజు పాల్గొన్నారు. మోహంతి కౌముది గ్లోబల్ పాఠశాలలో భోగి మంటలు వేశారు. హరిదాసు వేషధారణలో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డెంకాడ : లెండి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. హరిదాసు వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకోగా, సంప్రదాయ, ఆధునిక నృత్యాలు, పాటలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వి.వి.రామారెడ్డి, వైస్ చైర్మన్ పి.శ్రీనివాసరావు, కరస్పాండెంట్ కె.శివరామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ హరిబాబు తమ్మినేని, తదితరులు పాల్గొన్నారు.

హరిదాసు వేషధారణలో చిన్నారులు ; లెండి కళాశాలలో సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు

వేపాడ : శ్రీ విక్టరీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. భోగి మంటలతోపాటు సంబరాలను ప్రారంభించారు. రంగవల్లులు, వివిధ రకాల పాటల పోటీలు, గాలిపటాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ విక్టరీ పాఠశాల అడ్మిన్ డైరెక్టర్ రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : మున్సిపాలిటీలో స్వామివారివీధి, సాయినగర్, గొల్లపల్లి అంగన్వాడీ కేంద్రాల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు సంక్రాంతి, సంప్రదాయాలు, సంస్కృతిపై అవగాహన కల్పించేందుకు ఈ సంబరాలు నిర్వహించినట్లు ఐసిడిఎస్ పిఒ జె.విజయలక్ష్మి అన్నారు. హరిదాసు, వివిధ వేషధారణల్లో చిన్నారులు ఆకట్టుకున్నారు.

విజయనగరం టౌన్ : ఐసిడిఎస్ ఐదో సెక్టార్ పరిధిలో ఉన్న పలు అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. అయ్యన్నపేట అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో చిన్నారులు, తల్లులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు రంగురంగుల ముగ్గులు వేసి, ప్రాంగణాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. చిన్నారులు హరిదాసు వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక గురజాడ పాఠశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. మన సంస్కృతి సాంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేసే క్రమంలో భాగంగా ముగ్గుల పోటీలు, గంగిరెడ్లు, జట్కాబండ్లు, తప్పెటగుళ్ళు, కోలాటం భోగి మంటలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వాజీ ఛానల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసరావు, రిటైర్డు డిఆర్‌ఒ గణపతిరావు, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంగలి పోతన్న, రిటైర్డ్ హెడ్మాస్టర్ జె.రామకృష్ణ పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజి, కరెస్పాండెంట్ ఎం.స్వరూప, ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి : గొట్లాం గాయత్రి టెక్నో పాఠశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ముగ్గులు, పతంగుల పోటీలు నిర్వహించారు. భోగి మంటలు, బొమ్మల కొలువులతో ఆకట్టుకున్నారు. విద్యార్థులు హరిదాసు, సోదమ్మ, రైతు తదితర వేషధారణాలతో అలరించారు. పాఠశాల డైరెక్టర్ ఎరుకునాయుడు, కరస్పాండెంట్ జగదీశ్వరి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యాజమాన్య ప్రతినిధులు హిమజ, ఎఒ రాఘవకుమార్ పాల్గొన్నారు.

వేపాడ.. విక్టరీ పాఠశాలలో సంప్రదాయ వస్త్రధారణల్లో విద్యార్థినులు

గాజులరేగలోని నారాయణ పాఠశాలలో వివిధ వేషధారణల్లో చిన్నారులు

కార్పొరేషన్ కార్యాలయానికి సంక్రాంతి శోభ

విజయనగరం టౌన్ : నగరపాలక సంస్థ ప్రాంగణంలో మహిళా ఉద్యోగులు ముగ్గులు వేసి సంక్రాంతి శోభ ను సంతరింపజేశారు. రకరకాల ముగ్గులతో, రంగులతో అలంకరించారు. భోగి, సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని సాంప్రదాయబద్ధంగా వస్తున్న రంగుల ముగ్గులు వేసి మహిళలు ఆనందోత్సాహాలతో సందడి చేశారు.

ఆర్గానిక్ పంటలకు ప్రోత్సాహం

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ • కలెక్టరేట్‌లో ఆర్గానిక్ కూరగాయల సంత ఏర్పాటు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఆర్గానిక్ ఉత్పత్తులు ఆరోగ్యానికి మంచి చేస్తాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియం వద్ద ప్రకృతి సహజ సిద్ధంగా రైతులు పండించిన ఆర్గానిక్ ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను జిల్లా కలెక్టర్ అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో కలెక్టర్ మాట్లాడి ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారు, ఎంత పెట్టుబడి పెడుతున్నారు, ఎంత లాభం వస్తోంది, అందులో సమస్యలేమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన రైతులు ఈ సంతలో పలు రకాల ఆకు కూరలు, కూరగాయలు, చిరు ధాన్యాలు, ఆర్గానిక్ బెల్లం, పలు వెరైటీ ల కొత్త బియ్యం , ఆర్గానిక్ వంటకాలు, తిను బండారాలు, అరిసెలు, భోగి పిడకలు, అరటి, జామ పండ్లు తదితర ఉత్పత్తులను ప్రదర్శించారు. మధ్యాహ్నం 1 గంట వరకు విక్రయించగా కలెక్టరేట్ , చుట్టూ పక్కల శాఖల నుండి విచ్చేసిన ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరై కొనుగోలు చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా తో మాట్లాడుతూ జిల్లాలో పెద్ద ఎత్తున ఆర్గానిక్ పంటలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 12 వేల ఎకరాల్లో ఆర్గానిక్ పంటలు పండిస్తున్నారని, ప్రజలు కూడా ఈ ఉత్పత్తుల పై ఆసక్తి కనబరుస్తున్నారని, ఈ సాగును పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తారక రామారావు, ఇతర వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

కుష్టి వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు
20 నుంచి ఇంటింటి సర్వే

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2 వరకు కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించేందుకు ఇంటింట సర్వే చేపట్టనున్నట్లు డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్. జీవన రాణి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో రెండు రోజులు పాటు పిహెచ్‌సి వైద్యాధికారులకు జరిగిన శిక్షణలో ఆమె మాట్లాడారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింట సర్వే పటిష్టంగా చేయించాలని తెలిపారు. గుర్తించిన కేసులకు సత్వర వైద్యసేవలు అందించాలని తెలిపారు. కుష్టు వ్యాధిపై ప్రజలలో ఉన్న అపోహలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసి నివారణ అధికారి కె.రాణి, డిఎన్ఎంఒ డాక్టర్ అర్చన తదితరులు పాల్గొన్నారు.

లైన్ డిపార్టుమెంటులన్నీ సహకరించాలి

కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపుపై ఈ నెల 20 నుంచి నిర్వహించే కార్యక్రమానికి లైన్ డిపార్టుమెంట్‌లన్నీ సహకరించాలని కలెక్టర్ అంబేద్కర్ సూచించారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లో లెప్రసీ అవగాహన కార్యక్రమంపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. శరీరం పై స్పర్శ లేని మచ్చలు, చర్మం పై రాగి రంగు మచ్చలు, లావుగా మారిన, నొప్పి తో కూడిన నరములు, కాళ్ళు లేద చేతులు కండరాలలో బలహీనత ఉన్న, చేతులు, పాదాలు నరములలో తిమ్మిర్లుగా అనిపించినా పరీక్షలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం పై డ్వాక్రా, మెప్మా , అంగన్వాడీల ద్వారా ప్రచారం జరగాలని తెలిపారు. అనంతరం అందుకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. సమావేశంలో డిఎంహెచ్ఒ జీవనరాణి, జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ రాణి , విద్య, వైద్య శాఖ , ఐసిడిఎస్, మెప్మా , డిఆర్‌డిఎ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం పెట్టాలి

అన్న క్యాంటీన్‌లో టిఫిన్ చేస్తున్న కమిషనర్ రామలక్ష్మి

ప్రజాశక్తి-బొబ్బిలి

అన్న క్యాంటీన్‌లో నాణ్యమైన టిఫిన్, భోజనాలు పెట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సూచించారు. పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను శుక్రవారం కమిషనర్ సందర్శించి, టిఫిన్ నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్న క్యాంటీన్‌లో మెనూ అమలు చేయాలని, నాణ్యత లోపిస్తే చర్యలకు సిఫార్సు చేస్తామని తెలిపారు.

సకాలంలో విధులకు హాజరవ్వాలి

మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సకాలంలో విధులకు హాజరు కావాలని కమిషనర్ రామలక్ష్మి సూచించారు. మున్సిపల్ శానిటేషన్ కార్యాలయాన్ని కమిషనర్ తనిఖీ చేసి మస్తర్ రికార్డును పరిశీలించారు. వార్డుల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు సకాలంలో విధులకు హాజరు కాకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని కోరారు.

పార్కు సందర్శన

రాణి మల్లమ్మదేవి మున్సిపల్ పార్కును కమిషనర్ రామలక్ష్మి సందర్శించారు. పార్కులో మొక్కలకు నీరు పోసి, గ్రాస్ కటింగ్ కోసం ఇద్దరు కార్మికులు, సూపర్‌వైజర్‌ను నియమించాలని మున్సిపల్ ఎఇ గుప్తాను ఆదేశించారు. పార్కును సుందరంగా ఉంచాలన్నారు.

డిఎంహెచ్ఒ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రికార్డులు తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఒ జీవనరాణి

జరజాపుపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్, కొండవెలగాడ, మొయిద పిహెచ్‌సిలను శుక్రవారం డిఎంహెచ్ఒ జీవనరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాల అమలుపై ఆమె ఆరాతీశారు. కొండవెలగాడ పిహెచ్‌సికి వచ్చిన గర్భిణులతో మాట్లాడారు. హైరిస్క్ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. అనంతరం మందుల నిల్వ గదిని పరిశీలించి యువిన్ పోర్టల్‌ను, ఇహెచ్ఆర్, టెంపరేచర్ రిజిస్టర్, ఇ-ఔషధి యాప్‌లపై దృష్టి పెట్టాలని ఫార్మాసిస్ట్‌ను ఆదేశించారు. పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్‌కి ఎర్లీ రిజిస్ట్రేషన్, 100 డేస్ టీబీ కార్యక్రమం, ఎన్‌సిడిసిడి 3.0, ఆర్‌బిఎస్‌కె కార్యక్రమంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌హెచ్ఒ, సిసి ఎస్.సూరి అప్పారావు, అనిల్ ప్రేమ్‌కుమార్, వైద్యాధికారులు వై.ధనంజయ్, పి.వి.శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు తగవు

ప్రజాశక్తి-బొండపల్లి

టిడిపి కూటమి ప్రభుత్వంలో అధికారులు రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం తగదని ఎంపిపి చల్ల చల్లంనాయుడు అన్నారు. నిబంధనలను పక్కాగా పాటించాలని రెవెన్యూ అధికారులు నిర్ణయిస్తే, ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలోని గొల్లలపేట గ్రామంలో గురువారం పీతల చంటిబాబుకు చెందిన రేకుల షెడ్‌ను రెవెన్యూ అధికారులు కూలగొట్టిన నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని శుక్రవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకర్లతో ఎంపిపి మాట్లాడుతూ 13 సంవత్సరాలుగా రేకుల షెడ్ వేసుకొని జీవనం సాగిస్తున్న చంటిబాబు.. కేవలం వాలంటీర్‌గా విధులు నిర్వర్తించడంతో రాజకీయ కక్ష సాధింపునకు పాల్పడ్డారని తెలిపారు. సెంటున్నర స్థలంలో వేసిన షెడ్‌ను తొలగించారని, అదే సర్వే నంబర్లోని మిగతా ప్రభుత్వ భూమి ఆక్రమణలను ఎందుకు తొలగించలేదని అధికారులను ప్రశ్నించారు. మండలంలో చాలా చోట్ల జాతీయ రహదారితోపాటు ఆర్అండ్‌బి రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు ఉన్నాయని తెలిపారు. రేకుల షెడ్ వేసుకొని జీవనం సాగిస్తున్న వారిపై కక్ష సాధించడ నీచమైన సంస్కృతి అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇకనైనా ప్రభుత్వ పెద్దలు ఆలోచించి కక్ష సాధింపు చర్యలను విడనాడాలని హితవుపలికారు. కార్యక్రమంలో బొండపల్లి, ముద్దూరు సర్పంచులు బొండపల్లి ఈశ్వరరావు, మునకాల పైడిపునాయుడు, ఉప సర్పంచ్ కోల వెంకటరమణ, ఎంపిటిసి బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధితులతో మాట్లాడుతున్న ఎంపిపి చల్లంనాయుడు

హౌసింగ్ ఎఇగా గంగాధర్

ప్రజాశక్తి-వేపాడ

గృహ నిర్మాణ సంస్థ ఎఇగా జి.గంగాధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇంతవరకు బొండపల్లి మండలంలో పనిచేసేవారు. ఇక్కడ పని చేసిన ఎఇ గంట అప్పలనాయుడు బదిలీపై బొండపల్లి వెళ్లారు. ఎఇ గంగాధర్ మాట్లాడుతూ గతంలో ఇక్కడ హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఉందన్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయడంతోపాటు లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

నేరాలు ఘోరాలు

గంజాయి తాగుతున్న ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరంలోని గూడ్స్ షెడ్ జంక్షన్ వద్ద కొంతమంది వ్యక్తులు గంజాయి తాగుతున్నట్లు సమాచారం రావడంతో వన్‌టౌన్ సిఐ శ్రీనివాస్ ఆధ్వర్యానసిబ్బంది అక్కడికి చేరుకొని ఒకరిని పట్టుకున్నారు. అతడిని విచారించగా ఇచ్చిన సమాచారంతో మరో ఆరుగురు గంజాయి తాగుతుండగా పట్టుకున్నారు. వీరంతా కెఎల్‌పురం, బాబామెట్ట, దాసన్నపేటకు చెందిన వారు. వీరిలో ఇంజినీరింగ్ విద్యార్థులు కూడా ఉన్నారు. వారు గంజాయి తాగుతున్న పరికరాలను, బాటిల్స్‌ను, కొంత గంజాయి మెటీరియల్‌ను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు.వీరిపై కేసు నమోదు చేసినట్లు సిఐ శ్రీనివాస్ తెలిపారు.

8 మద్యం బాటిల్స్ స్వాధీనం

ప్రజాశక్తి-గంట్యాడ

ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్సుమెంట్ ఎస్ఐ రామారావు, సిబ్బంది గంట్యాడ మండలం, పెంట శ్రీరామపురం గ్రామంలో దూడ్డు శ్రీనివాసరావును 8 బాటిల్స్‌తో పట్టుకున్నారు. అతనిపై కేసు నమోదు చేశారు. ఈ రైడ్‌లో హెచ్.సి నాగేశ్వరావు, ఇసి జనార్దన్ నాయుడు, ధనలక్ష్మి పాల్గొన్నారు

పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని వాడాడ గ్రామానికి చెందిన వాడబోయిన సన్యాసి ఇల్లు గురువారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. సుమారు రూ.50 వేలు ఆస్తినష్టం వాటిల్లింది. తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి ఎ.రాంప్రసాద్.. బాధిత కుటుంబానికి రూ.2 వేలు ఆర్థిక సాయం చేశారు. అధికారులు స్పందించి, ఆస్తి నష్టాన్ని అంచనా, ఆదుకోవాలని బాధితుడు సన్యాసి కోరుతున్నారు.

జనంతో కళకళలాడుతున్న మార్కెట్

జనంతో మార్కెట్ కిటకిట

ప్రజాశక్తి-బొబ్బిలి

సంక్రాంతికి సరుకులు కొనుగోలు చేసేందుకు గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో జనం రావడంతో మార్కెట్ కిటకిటలాడింది. సంక్రాంతి సమీపిస్తున్నా రెండు రోజుల క్రితం వరకు జనం లేక మార్కెట్ వెలవెలబోయింది. సంక్రాంతి సామాన్ల కొనుగోలుకు జనం రావడంతో శుక్రవారం మార్కెట్ కిక్కిరిసింది. దీంతో వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-కొత్తవలస

నాయీబ్రాహ్మణ సంఘం కొత్తవలస మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. మండలంలోని అప్పన్నదొరపాలెం గ్రామంలో దారలోవలో సంఘ గౌరవ అధ్యక్షులు తెలగరాపు అప్పారావు ఆధ్వర్యంలో శుక్రవారం సంఘ సమావేశం నిర్వహించారు. అధ్యక్షులుగా వడ్డాది శంకర్రావు, ఉపాధ్యక్షులుగా రేగ ప్రసాద్, కార్యదర్శిగా మల్లువలస సత్తిబాబు, సహాయ కార్యదర్శిగా తెలగరాపు దేవుళ్ళ, కోశాధికారిగా పట్నాల ప్రసాద్, సహాయ కోశాధికారిగా సతీష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.